క్లుప్తంగా

ఘనంగా శని జయంతి ఉత్సవాలు



శనేశ్వరునికి ప్రత్యేక పుష్పాలతో అలంకరణ

పెద్దతిప్పసముద్రం : స్థానిక పార్వతీ సమేత విరూపాక్షేశ్వరస్వామి ఆలయంలో గురువారం శని జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. శివాలయం అర్చకులు పట్టాభిరామయ్య శనీశ్వరుడిని ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. అనంతరం నగ్రగ్రహాలను అభిషేకించి, హోమం, మహా మంగళ హారతి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు స్వామి తీర్థ ప్రసాదాలను అందజేసి అన్నదానం నిర్వహించారు.

మోడల్ పాఠశాలలో ప్రవేశాలు

పెద్దమండ్యం: స్థానిక మోడల్ పాఠశాలలో 7, 8, 9వ తరగతులలో ఖాళీ సీట్ల ప్రవేశాలకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ రామాంజులునాయక్ తెలిపారు. ఈ నెల 9వ తేదీ వరకు దరఖాస్తు స్వీకరణకు గడువు విధించినట్లు చెప్పారు. 10వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహించి, మార్కుల ఆధారంగా విద్యార్థుల ఎంపిక ఉంటుందని తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్క నాటుతున్న ఎంఈవో వెంకటలక్ష్మి

వాల్మీకిపురం : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఎంఈవో వెంకటలక్ష్మి అన్నారు. స్థానిక పీవీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని కాపాడేందుకు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవీంద్రారెడ్డి, నాగరాజ, తదితరులు పాల్గొన్నారు.

కార్పెంటర్ల కాలనీలో నిర్మాణాలు నిలిపివేయండి



కార్పెంటర్ కాలనీని పరిశీలిస్తున్న తహసీల్దారు మహబూబ్‌బాషా

పీలేరు : స్థానిక మదనపల్లె మార్గంలోని కార్పెంటర్ల కాలనీలో నిర్మాణాలు నిలిపివేయాలని తహసీల్దారు మహబూబ్ బాషా అన్నారు. తహసీల్దారు మాట్లాడుతూ కాలనీలో నిర్మాణాలపై ఫిర్యాదులు రావడంతో తాము పరిశీలించినట్లు తెలిపారు. రికార్డులు చూసి తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ చాణిక్య, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారం సకాలంలో అందించాలి



అంగన్‌వాడీ కేంద్రం వద్ద విచారిస్తున్న ప్రాజెక్ట్ డైరెక్టర్ శశికళ, తదితరులు

కలకడ: అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం అందించే పౌష్టికాహారం అందించే బాధ్యత అంగన్‌వాడీ సిబ్బందిపై ఉందని పీలేరు ప్రాజెక్ట్ డైరెక్టర్ శశికళ అన్నారు. మండలంలోని కలకడ పంచాయతీ కలకడకొత్తపల్లె, దేవులపల్లె పంచాయతీ గ్రామాలలోని అంగన్‌వాడీ కేంద్రం, ప్రీ స్కూల్‌ను గురువారం ఆయన తనిఖీ చేశారు. రికార్డుల నమోదు మేరకు విద్యార్థుల హాజరు, వారికి అందిస్తున్న ఆహారం వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలపై ఎలాంటి ఫిర్యాదు అందినా.. సిబ్బందిపై వేటు తప్పదని హెచ్చరించారు. ఆయా కేంద్రాలలో విద్యుత్ సౌకర్యం, నీటి వసతి, చిన్నారులకు ఆట స్థలం, గదుల శుభ్రత తీరును ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సిడిపీఓ రాజమ్మ, యశోద, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా శని జయంతి

పెద్దతిప్పసముద్రం : స్థానిక పార్వతీ సమేత విరూపాక్షేశ్వరస్వామి ఆలయంలో గురువారం శని జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. శివాలయం అర్చకులు పట్టాభిరామయ్య శనీశ్వరుడిని ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. అనంతరం నగ్రగ్రహాలను అభిషేకించి, హోమం, మహా మంగళ హారతి కార్యక్రమాలు నిర్వహించారు.

బోర్డులు సరే.. సమాచారమేది?

గుర్రంకొండ మార్కెట్ యార్డులో టమాటా ధరలను సూచించే సమాచార బోర్డులు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. పరిసర ప్రాంతాల మార్కెట్ యార్డుల్లో ఎంతమేరకు టమాటా ధరలు ఉన్నాయో ప్రతి రోజూ సమాచార బోర్డులో నమోదు చేయాల్సి ఉంది. అయితే అక్కడ ఎలాంటి ధరల సమాచారం లేక పోవడంతో రైతులు అయోమయానికి గురవుతున్నారు.

- మార్కెట్ యార్డులో కానరాని టమాటా ధరలు
- ఖాళీగా దర్శనమిస్తున్న ధరల సమాచార బోర్డులు



మార్కెట్ యార్డు కార్యాలయం ఎదుట డిజిటల్ బోర్డులో సమాచారం లేని దృశ్యం



గుర్రంకొండ మార్కెట్‌యార్డులో ఏర్పాటుచేసిన బోర్డులో ధరల సమాచారం

గుర్రంకొండ : స్థానిక మార్కెట్ యార్డులో టమాటా ధరలు కనబరిచే బోర్డులు వెలవెలబోతున్నాయి. సాధారణ బ్లాక్ బోర్డుతోపాటు కార్యాలయం ముందు భాగంలో ఏర్పాటు చేసిన డిజిటల్ బోర్డులోనూ సమాచారం కనిపించడం లేదు. నిబంధనల ప్రకారం ప్రతి రోజూ మార్కెట్ యార్డులో టమాటా వేలం పాట నిర్వహించే సమయానికి వివిధ పట్టణాల్లోని మార్కెట్ యార్డుల్లో ధరలు ఆయా బోర్డుల్లో కనబరచాల్సి ఉంది.

అయితే అధికారులు ఆమేరకు జాబితా తయారు చేయడం లేదు. రైతులు ముందుగానే వచ్చి టమాటా ధరలు తెలుసుకని విక్రయాలపై ఒక అంచనాకు వచ్చేందుకు అవకాశం ఉంటుంది.

డిజిటల్ బోర్డులు వృథా

గత కొన్ని రోజులుగా బోర్డుల్లో ధరల సమాచారం కరువైంది. మదనపల్లె, కలికిరి మార్కెట్ యార్డుల్లోని డిజిటల్ బోర్డులో చుట్టు పక్కల పట్టణాల్లోని యార్డుల్లో టమాటా ధరలు చూపించడం లేదు. గుర్రంకొండ మార్కెట్ యార్డులో సాయంకాలం నాలుగు గంటల నుంచి టమాటా వేలంపాట మొదలవుతుంది. అప్పటికే పలు పట్టణాలలోని యార్డుల్లో వేలం పాట ముగిసిపోయి ధరలు తెలిసిపోతుంటాయి. గుర్రంకొండ యార్డులో అన్ని మార్కెట్లలోని టమాటా ధరలు వేలం పాటల కంటే ముందే ప్రకటించేవారు. అయితే కొద్ది రోజులుగా ఈ తతంగం జరగడంలేదు. బోర్డులు కేవలం దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందిచి సమాచారం పొందుపరచాలని రైతులు కోరుతున్నారు.

ధరలు తెలియజేస్తాం



యార్డులోని సమాచార బోర్డుల్లో టమాటా ధరలు రైతులకు అందుబాటులో ఉంచుతాం. రెండు బోర్లు సమాచార బోర్డులు ఏర్పాటుచేశాం. కార్యాలయం వద్ద డిజిటల్ సమాచార బోర్డులు ఉంచాం. కొన్ని నెలలుగా వినియోగంలోకి రావడంలేదు. ఇక మీదట సమాచారం ప్రతి రోజూ బోర్డుల్లో ఉంచుతాం.

– కుమార్‌రెడ్డి, మార్కెట్ కమిటీ కార్యదర్శి, వాల్మీకిపురం

గౌరవ వేతనం చెల్లించాలి



డీటీ రెడ్డన్నకు బీఎల్‌ఓలతో కలిసి వినతిపత్రం ఇస్తున్న ఏఐటీయూసీ నేత సిద్దిగాళ్ల శ్రీనివాసులు

లక్కిరెడ్డిపల్లె : 2024 సార్వత్రిక ఎన్నికల్లో నిరంతరం సేవలందించిన బూత్ స్థాయి అధికారులు బీఎల్‌ఓలకు గత రెండు సంవత్సరాలుగా గౌరవ వేతనం చెల్లించలేదని, వీరికి వెంటనే గౌరవ వేతనం చెల్లించాలని అన్నమయ్య జిల్లా ఏఐటీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దిగాళ్ల శ్రీనివాసులు గురువారం డిప్యూటీ తహసీల్దార్ రెడ్డన్నకు బీఎల్‌ఓలతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలుగా ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ల సవరణ నుంచి ఓటర్ల తుది జాబితా వరకు పనిచేసిన బీఎల్‌ఓలకు ఎన్నికలు అయిపోయి కొత్త ప్రభుత్వం ఏర్పడుతున్నా వారికి రావాల్సిన జీతభత్యాలు మంజూరు చేయకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఎన్నికల విధులలో పాల్గొన్న బూత్ స్థాయి సిబ్బందికి నగదు అందే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనకు సిద్ధమవుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బూత్ స్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీకి ప్రత్యేక హోదా తీసుకురావాలి

బీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బందెలగౌతమ్



సమావేశంలో మాట్లాడుతున్న బీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బందెలగౌతమ్‌కుమార్

మదనపల్లె: టీడీపీ అధికారంలోకి వస్తే మదనపల్లెను జిల్లా కేంద్రం చేస్తామని చెప్పినందుకే ప్రజలు ఓట్లు వేసి గెలిపించారని, హామీని నిలబెట్టుకునే దిశగా ఎమ్మెల్యే షాజహాన్ బాషా కృషిచేయాలని బహుజన సమాజ్‌పార్టీ(బీఎస్పీ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు బందెలగౌతమ్ కోరారు. స్థానిక బీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో గురువారం ఆయన మాట్లాడుతూ గెలుపు, ఓటములతో సంబంధం లేకుండా బీఎస్పీ అసెంబ్లీ, పార్లమెంట్ అభ్యర్థులను నిలిపిందన్నారు. బహుజన వర్గాల అభివృద్ధి కోసం ఎన్నికల్లో పోటీ చేసిందన్నారు. రాష్ట్రంలో అధికారం దక్కించుకున్న కూటమి ప్రభుత్వానికి అభినందనలు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా అధికంగా దాడులు, అల్లర్లు జరుగుతున్నాయని, ప్రజాస్వామ్యంలో ఇలాంటి ధోరణులు మంచివి కావన్నారు. టీడీపీ నాయకులు బాధ్యతతో పనిచేయాలన్నారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తన స్వార్థ రాజకీయ ప్రయోజనాలపై కాకుండా రాష్ట్ర అభివృద్ధిపై దృష్టి పెట్టి పాలన సాగించాలన్నారు. ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, మదనపల్లెను జిల్లా చేస్తామని హామీ ఇచ్చారని, ఈ కార్యక్రమంలో రమణ, సహదేవ, బాలాజీ, సంధ్య, అరుణ్, శివ, రెడ్డి, మహేష్, శీను, సోము, కన్నా పాల్గొన్నారు.

సమష్టి కృషితో ఎన్నికలు విజయవంతం

ఆర్వో హరిప్రసాద్



ఎన్నికల ప్రక్రియలో సహకారమందించిన ఉద్యోగులను అభినందిస్తున్న ఆర్వో హరిప్రసాద్

మదనపల్లె: ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు, ఓటర్లు, ఉద్యోగుల సమష్టి కృషితో సార్వత్రిక ఎన్నికల ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో పూర్తిచేయగలిగామని ఆర్వో హరిప్రసాద్ అన్నారు. స్థానిక సబ్ కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆర్వో హరి ప్రసాద్ మాట్లాడుతూ మదనపల్లె అసెంబ్లీ నియోజకవర్గం, రాజంపేట పార్లమెంటరీ నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి మే 13న పోలింగ్, జూన్ 4న కౌంటింగ్ ప్రక్రియలను ఆటంకాలు లేకుండా నిర్వహించామన్నారు. మార్చి 16న సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్, ఏప్రిల్ 18న నోటిఫికేషన్ వెలువడినప్పటి నుంచి నియోజకవర్గంలో ఎన్నికల కోడ్ అమలుకు పటిష్టమైన చర్యలు తీసుకున్నామన్నారు. నిబంధనలకు అనుగుణంగా 85 సంవత్సరాలు పైబడిన వృద్ధులు, దివ్యాంగులకు హోమ్ ఓటింగ్ నిర్వహించామన్నారు. ఎన్నికల్లో పాల్గొనే సిబ్బందికి, సర్వీస్ ఓటర్లకు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ నిర్వహించామన్నారు. అనంతరం ప్రధాన ఘటమైన మే 13న ఎటువంటి గొడవలు, ఘర్షణలకు తావివ్వకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియ నిర్వహించామన్నారు. నియోజకవర్గంలో ఎక్కడా రీపోలింగ్ అవసరం లేకుండా ఎన్నికలు పూర్తిచేశామన్నారు. ఇందుకు సహకరించిన పోలీస్‌యంత్రాంగానికి, ప్రభుత్వ ఉద్యోగులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. స్ట్రాంగ్‌రూమ్, కౌంటింగ్ హాల్‌కు సంబంధించి ఏర్పాట్లు నిర్వహించిన సర్వేశాఖకు చెందిన వెంకటరమణ, కృష్ణమూర్తి, నాగరాజు, శ్రీనివాసనాయక్ తదితరులను అభినందించారు. స్టాటిస్టికల్ రిటైర్డ్ ఆఫీసర్ గోపాలకృష్ణ, ఏఆర్వోలు తహసీల్దార్ రమాదేవి, బాలాజీరాజు, శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ కే.ప్రమీలను అభినందించారు.

క్రీడల్లో రాణిస్తే అందరికీ మంచి భవిష్యత్తు



సమ్మర్ క్యాంపులో పాల్గొన్న విద్యార్థులతో పీడీలు

హాకీ క్లబ్ కార్యదర్శి రెడ్డి శ్రీనివాస్

మదనపల్లె సిటీ: క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని జినరాజాదాస హాకీ క్లబ్ కార్యదర్శి రెడ్డి శ్రీనివాస్ అన్నారు. స్థానిక బీటీ కాలేజీ హాకీ మైదానం, ఫుట్‌బాల్ క్లబ్, వివేకానంద బాస్కెట్‌బాల్ అకాడమీ, సీటీఎం జెడ్పీ ఉన్నత పాఠశాలలో హాకీ వేసవి శిబిరాలు ముగిశాయి. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంల 1991-92లో చదివిన జెడ్పీ హెచ్ఎస్ విద్యార్థులు ముని, నాగేష్ రూ.15000 విలువ చేసే దుస్తులు, క్యాంపులో పాల్గొన్న క్రీడాకారులకు సర్టిఫికెట్లు, మెమోంటోలు అందించారు. రెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ వేసవి శిబిరాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగపడినట్లు తెలిపారు. పలువురు పీడీలు క్రీడాకారులకు శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు.

ఏటా సమ్మర్ క్యాంపులు నిర్వహించి క్రీడాకారుల్లో ఉత్తేజం కల్పించారన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ గిరిజా సాయిశేఖర్‌రెడ్డి, టీచర్లు రంజిత్, హర్ష, సుజాత, అమరనాథరెడ్డి, సచివాలయ వెల్ఫేర్ ఆఫీసర్ విశ్వేశ్వర, పీడీలు నరేష్‌బాబు, నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

క్షయ నివారణకు బీసీజీ టీకా



గుట్టపాలెంలో బీసీజీ టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది



బీసీజీ టీకా వేసే కార్యక్రమాన్ని తనిఖీ చేస్తున్న డాక్టర్ డ్యానీ ఫ్రాంక్లిన్



పీలేరు మండలంలో వృద్ధురాలికి బీసీజీ టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

కలికిరి: క్షయ వ్యాధి సోకకుండా తప్పనిసరిగా బీసీజీ టీకా వేయించుకోవాలని మండలంలోని మేడికుర్తి పీహెచ్‌సీ వైద్యాధికారిణి కావ్య గంధ పేర్కొన్నారు. మండలంలోని కలికిరి-4, మేడికుర్తి సచివాలయాల పరిధిలోని విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో బీసీజీ టీకాల వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 60 ఏళ్లకు పైబడిన వారు, పొగ పీల్చువారు, 18-60 సంవత్సరాల మధ్య మధుమేహ వ్యాధిగ్రస్తులు, టీబీ నుంచి కోలుకున్నవారు, వారి కుటుంబసభ్యులు టీకా వేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఈ మహమ్మద్‌రఫీ, టీబీ పర్యవేక్షకులు నాగిరెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీలు కృష్ణ కుమారి, పావని, ఏఎన్‌ఎంలు మాధవి, రమాదేవి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

టీకాపై అవగాహన కల్పించాలి

కేవీపల్లె: అర్హులైన వయోజనులకు బీసీజీ టీకాపై అవగాహన కల్పించాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ సలహాదారు డాక్టర్ డ్యానీ ఫ్రాంక్లిన్ పేర్కొన్నారు. మండలంలోని గర్నిమిట్ట పీహెచ్‌సీ పరిధిలోని సొరకాయలపేట పంచాయతీ మిన్నంరెడ్డిగారిపల్లెలో గురువారం బీసీజీ టీకాలు వేశారు. టీకా కార్యక్రమంపై ప్రణాళిక, భద్రపరచిన తీరు, సూది మందు, ఇతర సామగ్రి నిల్వలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీబీ వ్యాధిని అంతం చేయాలంటే ఎక్కువమంది బీసీజీ టీకా పొందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం సూచించిన మార్గనిర్దేశకాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణి డాక్టర్ రేష్మ, సీహెచ్‌వో భాగ్యలక్ష్మీ, మోహన్, పవన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

టీబీని అంతం చేద్దాం

పీలేరు రూరల్ : బీసీజీ టీకాతో టీబీని అంతం చేద్దామని డబ్ల్యూహెచ్‌వో ప్రత్యేక ఆరోగ్య పరిశీలకులు డాక్టర్ డ్యానీ ఫ్రాంక్లిన్ పేర్కొన్నారు. క్షయ వ్యాధి నిర్మూలన నిమిత్తం మండలంలోని తలపుల, మేళ్లచెరువు, బండ్లవంకలో నిర్వహించిన బీసీజీ టీకాలు వేసే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య సిబ్బంది విస్తృతంగా సర్వే నిర్వహించి బీసీజీ టీకాలకు అర్హులను గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రమేష్‌రెడ్డి, డాక్టర్ చంద్రశేఖర్, టీబీ యూనిట్ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన వేసవి శిక్షణా శిబిరాలు

రామాపురం : గత నెల రోజులుగా మండల కేంద్రంలోని గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన గ్రంథాలయం వేసవి శిక్షణా శిబిరాలు గురువారంతో ఘనంగా ముగిశాయి. విద్యార్థులకు వేసవి సెలవులు ఇచ్చిన దృష్ట్యా సమయం వృథా కాకుండా ఉండేందుకు గ్రంథాలయంలో వేసవి శిబిరాలను ఏర్పాటు చేశామని గ్రంథాలయం అధికారి సూర్యనారాయణరెడ్డి పేర్కొన్నారు. మాట్లాడుతూ వేసవి శిక్షణ శిబిరాలలో విద్యార్థులకు వ్యాసరచన, క్రీడలతోపాటు విజ్ఞానాన్ని పెంపొందించే అనేక కార్యక్రమాలు నిర్వహించామన్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ప్రతి గ్రంథాలయానికి ప్రజలు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రంథాలయంలోని పుస్తకాలు చదవడంతో ఎంతో మేలు జరుగుతుందన్నారు. గతంలో సెల్‌ఫోన్లు లేనప్పుడు చాలా మంది గ్రంథాలయాలకు వచ్చి చదువుకోవడంతో ఉన్నత శిఖరాలను అధిరోహించారని తెలిపారు. ప్రతి విద్యార్థి చిన్నతనం నుంచే పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలన్నారు.

వినయ్ కుమార్‌కు పురస్కారం

రాయచోటి టౌన్ : రాయచోటికి చెందిన అబ్దుల్ కలాం యువ కెరటం ట్రస్ట్ డైరెక్టర్ వినయ్ కుమార్‌కు తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్‌లో ఉన్న శ్రీ పొట్టి శ్రీరాములు యూనివర్శిటీ వారు పురస్కారం అందజేశారు. తెలంగాణ రాష్ట్రం 11వ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన లంబోదర కల్చరల్ అకాడమీ వారి ఆధ్వర్యంలో పురస్కారాలను అందజేశారు. ఈ పురస్కారాన్ని వినయ్ కుమార్ తల్లిదండ్రులు లక్ష్మినరసమ్మ, వెంకటేశ్వర్లు చేతులుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి అకాడమీ ద్వారా అందించే పురస్కారాన్ని తల్లిదండ్రుల చేతుల మీదుగా అందుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. అలాగే ఈ పురస్కారం నా బాధ్యతను మరింత పెంచిందని తెలిపారు.

ప్రతి కార్డుకు ఉచిత బియ్యం అందించాలి



కలకడలో ఎండీయూ వాహనం తనిఖీ చేస్తున్న డీఎస్‌ఓ రఘురాం, తదితరులు

కలకడ : ప్రతి కార్డుదారునికి సకాలంలో ఉచిత బియ్యం, నిత్యావసర సరకులు విధిగా అందించాలని డీఎస్‌ఓ రఘురాం ఆదేశించారు. మండలంలోని బాలయ్యగారిపల్లె, కలకడ టౌన్‌లో ఇంటింటికీ నిత్యావసర సరకులు పంపిణీ చేస్తున్న ఎండీయూ వాహనాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. వాహనంలో ధరల పట్టిక, కార్డుదారులకు అందిస్తున్న తూకం, ప్రభుత్వం పంపిణీ చేసి బియ్యం, జొన్నలు, చక్కర ఇతర స్టాక్ వివరాలను తనిఖీ చేశారు. ఎలాంటి అక్రమాలకు పాల్పడినా, కార్డుదారుల వద్ద ఎండీయూ ఆపరేటర్లు బియ్యం కొనుగోలు చేసినా క్రిమినల్ కేసులు తప్పవన్నారు. వర్షంలో తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, సమయం మీరిన రాగిపిండి కార్డుదారులకు ఇవ్వరాదని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కృపావతి, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

నీట్‌లో మెరిసిన ఆణిముత్యాలు



తేజ



బి.నేహారెడ్డి



ఆకాష్

రామాపురం : నీట్ యూజీ (ఎంబీబీఎస్) 2024 ఫలితాలలో మండలంలోని నల్లగుట్టపల్లె గ్రామం కస్పాకు చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయులు బండపల్లి శ్రీరాములు రెడ్డి మనుమరాలు, అన్నమయ్య జిల్లా మన జనప్రగతి జిల్లా ఇన్‌చార్జ్(విలేకరి) బండపల్లి మధుసూదన్‌రెడ్డి, మేఘనల కుమార్తె బండపల్లి నేహారెడ్డి 670 మార్కులు సాధించి ఆల్‌ఇండియా ఈడబ్ల్యూఎస్ విభాగంలో 1,651 ర్యాంక్‌ను సాధించింది. కృషి, పట్టుదలతో విజయవాడలోని శ్రీగోస్ లైట్స్ కళాశాలలో లాంగ్ టర్మ్ కోచింగ్ తీసుకొని 670 మార్కులు సాధించి అటు తల్లిదండ్రులకు, తను కోచింగ్ తీసుకున్న ఉపాధ్యాయ బృందానికి సంతోషాన్ని నింపింది. ఈ సంవత్సం జరిగే ఆల్ ఇండియా కౌన్సిలింగ్ విభాగంలో ఎయిమ్స్ కాలేజీలో సీటు సంపాదిస్తానని బండపల్లి నేహా రెడ్డి సంతోషాన్ని వ్యక్తం చేసింది.

ప్రతిభ చాటిన తేజ

రాజంపేట : పట్టణంలో బాలాజీ నగర్‌కు చెందిన సంగరాజు తేజ నీట్‌లో తన ప్రతిభను చాటుకున్నారు. 623 మార్కులు సాధించారు. ఉపాధ్యాయుడు లక్ష్మీనారాయణరాజు కుమార్తె తేజ విజయవాడ చైతన్యలో ఇంటర్ విద్యను అభ్యసించారు. ఈ విద్యార్థినికి ఆల్ ఇండియా 55409 ర్యాంకు వచ్చింది.

మెరిసిన పుల్లంపేట విద్యార్థి

పుల్లంపేట : మండలానికి చెందిన మాధవి, జయకృష్ణ దంపతుల కుమారుడు ఆకాష్ 690 మార్కులు సాధించి 4600 ఆల్ ఇండియా ర్యాంక్ సాధించారు. ఆకాష్‌ను కుటుంబసభ్యులు అభినందించారు.

మేలైన యాజమాన్యంతో అధిక దిగుబడులు



సాగులో ఉన్న వేరుశనగ పంట

రాయచోటి : వేరుశనగ సాగులో మేలైన యాజమాన్యం పాటించితే మంచి దిగుబడి పొందేందుకు వీలుంటుందని అన్నమయ్య జిల్లా వ్యవసాయాధికారి చంద్రనాయక్ తెలిపారు. మేలైన యాజమాన్య పద్ధతులు, విత్తనాలపై ప్రభుత్వ వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్తలు నిర్ధారించారని గురువారం సాక్షితో తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. నూనె గింజల పంటల్లో ప్రధానమైన పంట వేరుశనగ ముందుందన్నారు. జిల్లాలో రైతులు అధిక విస్తీర్ణంలో వర్షాధారంగా వేరుశనగను సాగు చేస్తారు. ప్రాంతాన్ని బట్టి ఆయా వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఖరీఫ్ వేరుశనగను జూన్ నుండి ఆగస్టు వరకు సాగు చేస్తారు.

నూతన రకాలు....

పాత రకాల స్థానంలో ప్రస్తుతం అధిక దిగుబడినిచ్చే అనేక నూతన రకాల విత్తనాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. అయితే సాగులో మేలైన యాజమాన్యం పాటించినట్లైతే మంచి దిగుబడి పొందేందుకు వీలుంటుందన్నారు. ఖరీఫ్‌లో వర్షాధారంగా వేరుశనగ పంట అధిక విస్తీర్ణంలో సాగు చేస్తారు. రాయలసీమ వ్యాప్తంగా కొత్త రకం వంగడాల విత్తనాలను ఎక్కువగా చేస్తారు. ముఖ్యంగా ఈ పంటకు ఇసుక, గరక నేలలు ఉండి కొద్దిపాటి నీటి వసతి ఉన్న ప్రాంతాలు అనుకూలమన్నారు. అయితే కొంతమంది రైతులు ఇంకా పాత రకాలనే సాగు చేయటం వల్ల ఆశించిన ఫలితాలు సాదించలేకపోతున్నారని తెలిపారు. దీనికితోడు తరచూ తుపాన్ల బెడద వల్ల దిగుబడి తగ్గుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో ఖరీఫ్ వేరుశనగలో అధిక దిగుబడిని పొందాలంటే రకాల ఎంపిక మొదలు పంట మార్పిడి వరకు, ఎప్పటికప్పుడు తగిన యాజమాన్య, సస్యరక్షణ చర్యలు చేపట్టినట్లయితే అధిక దిగుబడులు పొందే అవకాశం ఉంటుందన్నారు.

భూసార పరీక్షలు..

భూసార పరీక్షలను అనుసరించి ఎరువులు మోతాదును నిర్ణయించుకోవాలన్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో ఎరువులను అతిగా వాడరాదన్నారు. సిఫార్సు మేరకు సమయానికి ఎరువులు వేయాలన్నారు. ఇటు సూక్ష్మ పోషక లోపాలను ఎప్పటికప్పుడు గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా నాణ్యమైన దిగుబడులను పొందేందుకు అవకాశం ఉంటుందని జిల్లా వ్యవసాయ అధికారి వివరించారు.